సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



కబడ్డీ విన్నర్‌గా ఆర్ట్స్ కళాశాల..

కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విజేతగా నిలిచింది.

- 8లో▸



రామప్ప ఖ్యాతిని చాటాలి

రామప్ప దేవాలయ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క వలంటీర్లకు పిలుపునిచ్చారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

31.4^0 / 23.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

25న సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని పలు మండలాలతో పాటు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న శారీరక, వినికిడి, మానసిక, కంటిచూపు వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈనెల 25వ తేదీ శుక్రవారం రోజున జిల్లాకేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ అవినాశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల దివ్యాంగులతో పాటు రెన్యూవెల్ చేసుకునేవారు మీసేవల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. క్యాంపులు నిర్వహించే రెండు రోజుల ముందు మీసేవ కేంద్రాల్లో స్లాట్‌బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. స్లాట్ బుక్ చేసుకున్నవారే క్యాంపులకు హాజరు కావాలన్నారు. గతంలో తిరస్కరణకు గురైన వారికి అవకాశం లేదని వివరించారు.

జాబ్‌మేళా..

భూపాలపల్లి అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి అరూరి శ్యామల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రెడిట్ అక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ ప్రయివేట్ సంస్థలో పనిచేసేందుకు 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 97010 78288, 95024 68800 నంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

డీసీఓగా బాలు



కాటారం: గురుకులాల జిల్లా సమన్వయ అధికారి(డీసీఓ)గా కాటారం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ బి.బాలు నియమితులయ్యారు. ఈ మేరకు గురుకులాల కార్యదర్శి సోమవారం ఆదేశాలు జారీచేశారు. నూతనంగా నియమితులైన డీసీఓను కాటారం గురుకుల పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సరిత, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, బలరాములు, వెంకటయ్య, రజనీకాంత్, సంపత్, సతీశ్ పాల్గొన్నారు.


జేఎంఈటీలకు పదోన్నతులు కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సంస్థలో 2016 సంవత్సరంలో నియామకమైన జేఎంఈటీలకు పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శిక్షణ కాలం ముగిసి 8 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు. సంస్థలో ఓవర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోన్నతులు కల్పించకపోవడంతో ఒక్కో రోజు ఒక్కో విధమైన పనులకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించి చర్చించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు



ములుగు : బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. ఈ మేరకు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పాన్ ఇండియా రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ క్యాంపెయిన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా ములుగు పట్టణంలోని కిరాణాషాపులు, మెడికల్ షాపులు, హోటల్స్‌లో బాలకార్మి కులను పనిలో చేర్చుకోవద్దని సూచిస్తూ 'మా షాపులో బాలకార్మికులు లేరు'నే స్టిక్కర్‌ను అంటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, డీసీపీఓ ఓంకార్ పాల్గొన్నారు.

నల్లనేలలో..

అక్షర కాంతులు

పట్టభద్రులతో పెరిగిన యువరక్తం

- కారుణ్య పద్ధతిలో నియామకం
- ప్రైవేట్ ఉన్నత ఉద్యోగాలు వదిలి సింగరేణిలోకి..
- భూపాలపల్లి ఏరియాలో 800మందికి పైగా యువ కార్మికులు



భూపాలపల్లి అర్బన్: నల్ల బంగారాన్ని వెలికితీస్తూ 135 ఏళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణిలో గతానికి, ఇప్పటికీ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. గనుల్లో పని చేయడానికి ఎవరూ ముందుకురాని రోజుల్లో రైతు కూలీలను మభ్యపెట్టి కాంట్రాక్టర్లు వారితో కష్టమైన పనులు చేయించేవారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల నుంచి క్రమంగా అత్యుత్తమ స్థాయికి సింగరేణి ఎదిగింది. సంస్థలో కనీసం సంతకం చేయడం రాని కార్మికులు ఒకప్పుడు 90శాతం మేరకు ఉండేవారు. యాజమాన్యం కార్మికవాడల్లో అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించి కార్మికులతో పాటు వారి భార్యలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దింది. దీనికోసం లీడ్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారం తీసుకుంది. ఇలా 2009 వరకు 80శాతం అక్షరాస్యతను సాధించిన ఘనత సింగరేణిది. అప్పుడు అక్షరాలు దిద్దిన కార్మిక కుటుంబాలు.. ఇప్పుడు పట్టభద్రులతో సింగరేణి నిండిపోయిందంటే అతిశయోక్తి కాదు.

మహిళలకూ చోటు..

లింగ సమానత్వాన్ని పాటించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మహిళలకు సైతం సింగరేణిలో ఉద్యోగాలు లభిస్తున్నాయి. గతంలో భర్తలు చనిపోయిన కొద్ది మందికి ఉపరితలంలోని జీఎం కార్యాలయాలు, ఏరియా వర్క్‌షాపులు, సీహెచ్‌పీలు, సివిల్ విభాగాల్లో విధులు నిర్వర్తించేవారు. క్లరికల్ ఉద్యోగాల్లో కొంతమంది, ఏరియా ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో నర్సింగ్ సిబ్బంది నియామకాల్లో మహిళలకు అవకాశం లభించేది. ఇప్పుడు అన్ని విభాగాలు, జీఎం కార్యాలయాల్లో బాగా చదువుకున్న మహిళల సంఖ్య పెరిగింది. భూగర్భ, ఉపరితల గనుల్లోనూ వీరి సేవలను యాజమాన్యం వినియోగించుకుంటోంది.

మారిన జీవనశైలి

ఉద్యోగులు గతంలో మద్యానికి బానిసలని, పొదుపు అంటే తెలియని వారనే పేరు ఉండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. యాజమాన్యం 2008 నుంచి బ్యాంకుల ద్వారా వేతనాలు ఇచ్చే పద్ధతికి శ్రీకారం చుట్టిన తర్వాత కుటుంబాల్లో పొదుపు పెరిగింది. అంతకుముందు గనులపై వేతనాలు ఇచ్చే ఆనవాయితీ ఉండేది. పిల్లలను బాగా చదివించడం, మద్యం వాడకాన్ని తగ్గించడంతో పట్టభద్రులైన విద్యావంతుల సంఖ్య పెరిగింది. కార్మికుల పిల్లలు విదేశాల్లోనూ చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడినవారు దాదాపు 9వేల మందికి పైగా ఉంటారని అంచనా. భూపాలపల్లి ఏరియాలో 800లకుపైగా యువ కార్మికులు ఉంటారు. కారుణ్య నియామకాలకు తోడు, బయటి నుంచి యువతకు క్లరికల్‌తో పాటు ఇతర రంగాల్లో అవకాశాలు లభించడంతో ఇప్పుడు దాదాపు వంద శాతం అక్షరాస్యత కలిగిన సంస్థగా సింగరేణి పేరు గడించింది.

యువత ఇలా..

- సింగరేణిలో ప్రస్తుతం 41,500 ఉద్యోగులు పనిచేస్తుండగా.. అందులో 2,140మందికి పైగా అధికారులు ఉన్నారు. మిగతా ఉద్యోగుల్లో 22వేల వరకు యువత పనిచేస్తోంది. కారుణ్య నియామకాలతో సంస్థలో యువత సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.
- ప్రస్తుతం పనిచేస్తున్న యువతలో ఎక్కువ శాతం బీటెక్, ఎంబీఏ, ఎంటెక్, ఎంసీఏలతోపాటు సాధారణ డిగ్రీలు, పీజీలు చేసిన వారు ఉన్నారు. ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ సంస్థలు, బ్యాంకుల్లో పనిచేసిన వారు ఆ ఉద్యోగాలను వదులుకుని సింగరేణిలో పనిచేయడానికి ముందుకు వస్తున్నారు.
- గతంలో తట్ట చెమ్మాస్‌తో బొగ్గు ఉత్పత్తి చేసేవారు. ఇప్పుడు భూగర్భంలో యంత్రాలతో ఉత్పత్తి చేస్తుండటంతో పాటు గనిలోకి దిగడానికి మ్యాన్‌రైడింగ్ విధానం అంతటా ఉంది.

అమరుల త్యాగాలు మరువలేనివి

కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్



రక్తదానం చేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే ను పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలోని అమరవీరుల స్తూపం వద్ద స్మృతి పరేడ్‌లో భాగంగా కలెక్టర్, ఎస్పీ, ఓఎస్డీ బోనాల కిషన్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా అవసరాలు, సంరక్షణ కోసం ఏర్పడిన వ్యవస్థ పోలీస్ శాఖ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ.. ఇలా ప్రతీ సందర్భంలోనూ పోలీసు వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ.. జిల్లాలో దశాబ్దాల క్రితం మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేదన్నారు. జిల్లా పరిధిలో 18 మంది పోలీసులు సంఘ విద్రోహ శక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణనాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, యువత రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కేఎస్ కిరణ్ పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి..

ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, చట్ట ప్రకారం పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ప్రజావాణికి 15 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు.

ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

వాజేడు : ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు కల్పించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచంద్ర రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామచంద్ర రావు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఆదివాసీల హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని అన్నారు. ఆదివాసీ ఉద్యోగులు కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే అనేక జీఓలను అమలు చేసి ఉల్లంఘించిందని విమర్శించారు. జీఓ 33ను అమలుచేసి ఆదివాసీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్ద నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా కోరం సందీప్, ప్రధాన కార్యదర్శిగా మడకం గణేష్, కార్యదర్శిగా పీర్ల సాయికుమార్, కోశాధికారిగా గుర్రపు సాయితో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

- పరిమితికి మించి ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ కేంద్రాల ద్వారా శిక్షణా కేంద్రాల్లో సీట్ల భర్తీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో సీట్ల భర్తీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అడ్వాన్స్‌డ్ శిక్షణ కేంద్రంలో ఆరు కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఆరు కోర్సుల్లో 172 సీట్లు ఉన్నాయని.. ఇప్పటివరకు 43మంది దరఖాస్తు చేశారన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేయడం వలన యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ నెల 24న ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో 10వ తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్న విద్యార్థులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శిక్షణకు సంబంధించిన ఇతర వివరాలకు మొబైల్ నంబర్ 89851 00563కు కాల్‌చేసి సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ జాంలా నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిమితి మించితే చర్యలు..

పరిమితికి మించి ఇసుక రవాణాచేసే వాహనాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ టీజీఎండీసీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, పోలీస్, టీజీఎండీసీ, మైనింగ్, రవాణా, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, భూగర్భ జలాలు తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిమితికి మించి ఇసుక రవాణా చేయడం వలన రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రమాదాల నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అలాంటి వాహనాలకు జరిమానా విధించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మైనింగ్ ఏడీ జయరాజ్, టీజీ ఎండీసీ పీఓ శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారానికి తక్షణ చర్యలు..

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చారని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 35 దరఖాస్తులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దినచర్య పుస్తకం ఆవిష్కరణ..

పొరపాట్లకు తావులేకుండా ప్రజల సమగ్ర సమాచారం నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆశ కార్యకర్తలను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో కుటుంబ సంక్షేమ శాఖ రూపొందించిన ఆశ కార్యకర్తల దిన చర్యల రికార్డు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక స్వీప్ కార్యక్రమాలు..

ఎమ్మెల్సీ స్థానాల ఓటరు నమోదు దరఖాస్తుల విచారణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి ఓటరు రూపకల్పనపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక స్వీప్ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేశామని వెల్లడించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు

కాటారం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంచందర్‌రావు సోమవారం తీర్పునిచ్చారు. మహాముత్తారం మండలం మాదారం గ్రామానికి చెందిన సమ్మయ్య, పోలంపల్లికి చెందిన అలీమ్ కొన్ని రోజుల క్రితం మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఎస్సై మహేంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఇద్దరిని కోర్టులో హాజరుపర్చారు. సమ్మయ్యకు ఐదు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా, అలీమ్‌కు రెండు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. ఇద్దరిని పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొనుగోళ్లకు ముందే 'మిల్లర్ల మెలిక'

సన్నరకాలు మరాడించేందుకు ససేమిరా..

- సీఎంఆర్, ఔట్ టర్న్‌పై స్పష్టత కరువు
- ఉమ్మడి వరంగల్‌లో 1,128 కేంద్రాలు..
- 12.25 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- కొనుగోళ్లకు రంగం సిద్ధం చేసిన అధికారులు
- రైస్‌మిల్లర్లతో పౌరసరఫరాలశాఖ సంప్రదింపులు

సాక్షిప్రతినిధి, వరంగల్ :



జిల్లాల వారీగా ధాన్యం కేంద్రాలు, కొనుగోలు లక్ష్యాల వివరాలు..

జిల్లా	కొనుగోలు కేంద్రాల సంఖ్య	సేకరణ లక్ష్యం (టన్నుల్లో)
హనుమకొండ	149	1,50,000
వరంగల్	203	2,10,000
మహబూబాబాద్	234	2,90,000
జయశంకర్ భూపాలపల్లి	189	2,10,000
ములుగు	173	1,55,000
జనగామ	180	2,10,000
మొత్తం	1,128	12,25,000

వానాకాలం ధాన్యం సేకరణపై రైతులకు నిరీక్షణ తప్పేటట్టు లేదు. జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో వరికోతలు మొదలవగా.. జేఎస్.భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో మరికొంత సమయం పట్టనుంది. వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల, మార్కెటింగ్ శాఖలు సన్నద్ధం కాగా.. రైతులు సైతం కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు ఈ వానాకాలం సీజన్‌లో ఎక్కువ మొత్తంలో రైతులు సన్న రకం వరి పంటనే సాగు చేసిన సంగతి తెలిసిందే. ఎప్పటిలాగే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కింద రైస్‌మిల్లులకు తరలించేందుకు పౌరసరఫరాల సంస్థ సన్నాహాలు చేస్తుండగా.. సీఎంఆర్ శాతం 67 నుంచి 58కి తగ్గిస్తేనే ధాన్యం దింపుకుంటామని రైస్‌మిల్లర్లు స్పష్టం చేస్తున్నారు. దీంతో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ముందే అవాంతరాలు ఏర్పడుతున్నాయి.


ఇదీ వానాకాలం లక్ష్యం..

ఉమ్మడి వరంగల్‌లో ఈ వానాకాలంలో 8.10 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే అది 9,02,233 ఎకరాలకు పెరిగినట్లు ప్రకటించిన అధికారులు.. సుమారు లక్ష ఎకరాల్లో మాత్రం దొడ్డు రకాలు వేయగా, 90 శాతం సన్నరకాలే వేసినట్లు తేల్చారు. ఈ మేరకు దిగుబడిని అంచనా వేసి 12.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఆరు జిల్లాల్లో దశల వారీగా 1,128 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని రైస్‌మిల్లర్లు చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని రా రైస్, పారాబాయిల్డ్ రైస్‌మిల్లుల సంక్షేమ సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీలు స్పష్టం చేశాయి. ఇదే విషయాన్ని తమ రాష్ట్ర సంఘం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది. ఈ నేపథ్యంలో 12.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ఎలా సాధ్యమనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సన్నరకాలపై మిల్లర్ల పేచీ..

సీఎంఆర్ దొడ్డు రకాలపై వచ్చే తరహాలో 67 శాతం ఔట్‌టర్న్ రాదని సన్నరకంపై రైస్‌మిల్లర్లు పేచీ పెడుతున్నారు. సన్న రకం ధాన్యం ఔట్ టర్న్ 58 శాతం మాత్రమే వస్తుందని, ఆమేరకు తగ్గించాలని, లేకుంటే క్వింటా ధాన్యానికి రూ.300 పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి రైస్ మిల్లర్ల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ధాన్యం నిల్వల తరుగుదలపై ఒక శాతం డ్రైయేజ్ చార్జీలతో పాటు, రైస్‌మిల్లులో ధాన్యం నిలవ్వచేసినందుకు ప్రతి నెలా క్వింటా ధాన్యానికి రూ.2.40 చొప్పున ప్రతీ సీజన్‌కు రెండు సార్లు కస్టోడియన్ చార్జీలతోపాటు పలు డిమాండ్లు తెరమీదకు తెస్తున్నారు. బియ్యం రవాణా, బ్లెండింగ్ చార్జీలతో పాటు గత ఆరేళ్లుగా బకాయి ఉన్న సీఎంఆర్ చార్జీలు చెల్లించాలని కోరుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో పాటు పౌరసరఫరాల అధికారులు వానాకాలం ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ తరలింపు సజావుగా సాగేందుకు రైస్‌మిల్లర్ల సంఘాలతో సంప్రదింపులు చేస్తున్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన జీఎం



భూపాలపల్లి అర్బన్: జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబును ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు ఆవరణలో జడ్జిని కలిసిన జీఎం పుష్పగుచ్ఛం అందజేసి పెండింగ్‌లో ఉన్న సింగరేణి కేసుల గురించి చర్చించినట్లు జీఎం తెలిపారు.

ఇసుక డంపులపై చర్యలేవి?

కాళేశ్వరం: మహదేవపూర్ మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో రెండు ఇసుక లారీల లోడును గుర్తు తెలియని అక్రమార్కులు డంపు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు రెండు రోజులుగా సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. జీరో దందాకు అలవాటుపడ్డ మండలానికి చెందిన ఓ వ్యక్తి డంపు చేసినట్లు తెలిసినా రాజకీయ ఒత్తిళ్లతో చర్యలు తీసుకోవడానికి పోలీసులు వెనుకాడుతున్నట్లు తెలిసింది. సంబంధిత టీజీఎండీసీ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వందల సంఖ్యలో ఓవర్‌లోడుతో వెళ్తున్న లారీలను తనిఖీ చేయడంలో ఆర్టీఏ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కుర్చీలోంచి లేచి నడవలేని స్థితిలో ఉన్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రతీ ఇసుక లారీకి నెలనెలా చెల్లింపులు జరుగుతున్నట్లు బహిరంగంగా చర్చ జరుగుతోంది. ఇసుక క్వారీలు నిర్వహించే కాంట్రాక్టర్ల నుంచి లారీ, టిప్పర్ల ఓనర్స్, టీజీఎండీసీ అధికారులు, సిబ్బంది వరకు అంతా సిండికేట్‌గా ఏర్పడి ఇలాంటి జీరో దందాకు పాల్పడుతూ రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన సొమ్ము పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇసుక జీరో దందాపై చర్యలు శూన్యం కావడంతో నిత్యం ఇదే రీతిలో పలిమెల, పెద్దంపేట, మద్దులపల్లి, పలుగుల, ఎడపల్లి తదితర క్వారీల నుంచి తరలిపోతున్నట్లు వినికిడి. అప్పుడప్పుడు తనిఖీల పేరుతో పోలీసులు సోదాలు చేస్తే ఐదు వరకు దొరికినా మూడు పట్టుకున్నట్లు కేసు నమోదు చేస్తూ మమా అనిపిస్తున్నారని సమాచారం. సోమవారం అయ్యప్ప ఆలయం వద్ద డంపు చేసిన ఇసుక నిల్వలను డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తన సిబ్బందితో కలిసి పంచనామా చేశారు.

క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్ : ఐటీఐ ఏటూరునాగారం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ పరిధిలో పదవ తరగతి పాసైన గిరిజన బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న హనుమకొండ గిరిజన భవన్‌లో, 25న మహబూబాబాద్ గిరిజన భవన్, 26న ములుగు గిరిజన భవన్‌లో అడ్మిషన్ల ఎంపిక కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

పరకాల: నిత్యం మద్యం సేవించడంతో అనారోగ్యం ఏర్పడుతుందని భార్య మందలించినందుకు భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పరకాల పట్టణంలో చోటుచేసుకుంది. పరకాలకు చెందిన మేరుగు మధుసూదన్ (35) స్థానికంగా బైక్ మెకానిక్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దసరా పండుగ నుంచి రోజూ మద్యం సేవించి ఇంటికి వస్తుండటంపై భార్య మనీషా కోపగించుకుంది. ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన మధుసూదన్‌ను మందలించగా మనస్తాపంతో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సహాయంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మనీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ క్రాంతికుమార్ సోమవారం తెలిపారు.

పాఠశాలలో పాము కలకలం



దంతాలపల్లి : మండలంలోని కుమ్మరికుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పాము కలకలం లేపింది. ఏడో తరగతి గదిలోకి పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయుడు బ్లాక్ బోర్డు దగ్గరకు వెళ్లాడు. అప్పటి వరకు కనిపించని పాము బోర్డు దగ్గర గోడ పక్కన కదలడంతో విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుడికి చెప్పగా అప్రమత్తమై పామును చంపేశారు. విద్యార్థులు పాము కదలికను చూడడంతో పెనుప్రమాదం తప్పింది.

ప్రహరీ లేకపోవడం వల్లే..

పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తరగతి గదుల్లోకి పలు మార్లు విషపురుగులు వచ్చాయని ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాజయ్య తెలిపారు. పాఠశాల చుట్టూ చేన్లు ఉండడంతో పాఠశాలల్లోకి పలుమార్లు వచ్చాయని, ఇంతకుముందు చాలా విషపురుగులను గ్రామస్తులు చంపినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రహరీ నిర్మించే వరకు గ్రామ పంచాయతీ అధికారులు పాఠశాల చుట్టూ చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు.

అవి నకిలీ పాస్ పుస్తకాలే..

నిర్ధారించిన ఎఫ్ఆర్ఓ డోలి శంకర్

- బ్యాంకు అధికారులకు సైతం టోకరా
- ఆ పుస్తకాలతో రూ. లక్షల్లో రుణాలు
- పోడు పట్టాల దందాపై 'సాక్షి' కథనానికి కదిలిన యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్

ములుగు రూరల్: ములుగు జిల్లాలో 'పోడు పట్టాల దందా' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. ములుగు మండలం అంకన్నగూడెం, కన్నాయిగూడెం, సర్వాపూర్, మదనపల్లి, జాకారం, పొట్లాపూర్, పెగడపల్లి గ్రామాల్లో అటవీశాఖ అధికారులు శాటిలైట్ సర్వే ఆధారంగా సాగులో ఉన్న గిరిజనులకు గత ప్రభుత్వ హయాంలో 463 మందికి పోడు పట్టాలు అందించారు. అయితే అధికారులు జారీ చేసిన పోడుపట్టాలకు ఏమాత్రం తీసిపోకుండా దళారులు నకిలీ పోడు పట్టాలు రూపొందించి అమాయకుల నుంచి డబ్బు కాజేస్తున్నారు. ఈ నకిలీ పోడుపట్టాల దందాపై 'సాక్షి' కథనం ప్రచురించడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

సుమారు రూ. 50 లక్షల నుంచి కోటి వరకు వసూళ్లు..

ములుగు మండలం కాశిందేవిపేట, రామయ్యపల్లి, రాంనగర్‌తండా గ్రామాల్లో పోడు పట్టాలు అందిస్తామని దళారులు అమాయకుల నుంచి సుమారు రూ. 50 లక్షల నుంచి కోటి వరకు వసూళ్లు చేసినట్లు సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ. 40 వేలు తీసుకుని 4 ఎకరాల భూమికి నకిలీ పట్టాలు అందించారు. నకిలీ పాస్ పుస్తకాల్లో అటవీ శివారు వేరే మండలాలలో భూములను చూపుతూ గతంలో పోడు పట్టాలు అందించిన పాస్ పుస్తకాల్లో సంతకాలు చేసిన కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ సంతకాలను ఫోర్జరీ చేసి పాస్ పుస్తకాలు అందించారు.



అటవీశాఖ రేంజ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంకుకు సమర్పించిన క్లియరెన్స్ సర్టిఫికెట్

నకిలీ పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు..

పోడు పట్టాలు పొందిన రైతులు అసలువే అని నమ్మి జంగాలపల్లి యూనియన్ బ్యాంకు, జిల్లా కేంద్రంలోని ఏపీజీవీబీలో రుణాలు పొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. లక్షా30 వేల రుణాలు మంజూరు చేశారు. మరో పది మంది రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. మండల పరిధిలో పోడు పట్టాలు పొందిన రైతుల వివరాలను బ్యాంకు అధికారులకు అందించినప్పటికీ కాసులకు కక్కుర్తి పడి నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.



బ్యాంకు నుంచి తీసుకున్న నకిలీ పాస్ పుస్తకాలను పరిశీలిస్తున్న అటవీశాఖ రేంజ్ అధికారి డోలి శంకర్

కదిలిన యంత్రాంగం..

అక్రమ పోడు పట్టాలు జారీ చేసిన విషయంపై కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. రుణాలు మంజూరు చేసిన బ్యాంకుల నుంచి నకిలీ పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఏపీజీవీబీ నుంచి ఏడు దరఖాస్తులను స్వాధీనం చేసుకుని పట్టాలు అందించిన దళారి ముఠాగుట్టు రట్టు చేసేందుకు సిద్ధమయ్యారు. బ్యాంకు రుణాలకు కోసం అటవీశాఖ అధికారుల క్లియర్స్ సర్టిఫికెట్‌ను కూడా దళారులు ఫోర్జరీ చేసి బ్యాంకులకు సమర్పించారని ఎఫ్ఆర్ఓ డోలి శంకర్ తెలిపారు.

కబడ్డీ విన్నర్ ఆర్ట్స్ కళాశాల..

- ముగిసిన కేయూ అంతర్ కళాశాలల క్రీడలు
- విజేతలకు బహుమతులు అందజేసిన అధికారులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మూడురోజులుగా నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ అంతర్‌కళాశాలల వివిధ క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య, ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి,సుబేదారి ఎస్‌బీఐ బ్రాంచీ మేనేజర్ అచ్యుత్.. ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ పుల్లారమేశ్, అధ్యాపకులు గిరిప్రసాద్, కుమార్, కిరణ్, డాక్టర్ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

- కబడ్డీ పోటీల్లో విన్నర్‌గా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల , రన్నరప్‌గా ఖమ్మంలోని వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల నిలిచింది.
- ఖోఖో పోటీల్లో విన్నర్‌గా హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీకళాశాల, రన్నరప్‌గా ఖమ్మంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల నిలిచింది.
- సాఫ్ట్‌బాల్ విన్నర్‌గా యూనివర్సిటీ ఆర్ట్సఅండ్ సైన్స్ కళాశాల,రన్నరప్‌గా వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల నిలిచింది.
- బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్‌గా వాగ్దేవి డిగ్రీ కళాశాల హనుమకొండ, రన్నరప్‌గా వరంగల్‌లోని సీకేఎం కళాశాల నిలిచింది.
- హ్యాండ్‌బాల్‌పోటీల్లో విన్నర్‌గా సీకేఎం కళాశాల, రన్నరప్‌గా కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల నిలిచింది.
- క్రాస్‌కంట్రీ పోటీల్లో విన్నర్‌గా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హనుమకొండ, రన్నరప్‌గా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ మరిపెడ నిలిచింది. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



క్రాస్‌కంట్రీ పోటీల్లో గెలుపొందిన కేడీసీ క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

- అప్పుల్లో కూరుకుపోయి జార్ఖండ్ వాసి ఆత్మహత్య

కాళేశ్వరం: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి స్నేహితుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లా బారాషాబాద్ మండలం అలోకడికి చెందిన విష్ణు మహత(20) జియోలాజికల్ సర్వే డిపార్టుమెంట్‌లో దినసరి లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన అతను అందిన కాడ అప్పులు చేశాడు. ఈనెల 18న మహదేవపూర్‌లోని రూమ్ నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతని స్నేహితుడు ధనేశ్వర్.. మహత ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో సోమవారం మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వెళ్లి పరిశీలించి విష్ణు మహతగా నిర్ధారించారు. మృతదేహం సగం వరకు కుళ్లిపోయింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

24న రైల్వే జీఎంతో ఎంపీల భేటీ

కాజీపేట రూరల్ : రైల్వే అభివృద్ధి పనులపై ఈనెల 24న సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో జిల్లా ఎంపీల భేటీ జరగనుందని రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే సమస్యలతో పాటు, నూతన లైన్ల నిర్మాణ ప్రతిపాదనలు, సర్వే అయి పెండింగ్‌లో ఉన్న లైన్ల నిర్మాణం, కాజీపేట వ్యాగన్ పీఓహెచ్ షెడ్, కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్, కాజీపేట–విజయవాడ మూడో లైన్, తదితర సమస్యలపై రైల్వే జీఎంతో ఎంపీలు చర్చించనున్నట్లు వారు పేర్కొన్నారు.

రామప్ప ఆలయ ఖ్యాతిని చాటాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క వలంటీర్లకు పిలుపునిచ్చారు. రామప్పలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపును సోమవారం సాయంత్రం సందర్శించి మాట్లాడారు. కాకతీయులు నిర్మించిన రామప్ప దేవాలయం 800 ఏళ్లు దాటిన చెక్కు చెదరకుండా ఉండడంతో పాటు రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడంలో ప్రొఫెసర్ పాండురంగారావు కృషిని కొనియాడారు. రామప్పలో శిక్షణ పొందిన వలంటీర్లు ఆలయ చరిత్రతో పాటు, తెలంగాణలోని చారిత్రాక కట్టడాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పర్యాటక ప్రాంతాలకు నెలవు ములుగు జిల్లా అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్.. రామజన్మభూమి (అయోధ్య) నుంచి తీసుకొచ్చిన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, మిల్కూరి ఐలయ్య, తుమ్మేటి రాజిరెడ్డి, తడాంద్ల గోపాల్, చెన్నోజు శ్రీనివాస్, జంగిలి రవి పాల్గొన్నారు.



వరల్డ్ హెరిటేజ్ వలంటీర్లతో మంత్రి సీతక్క

విద్యుత్ చార్జీలపై బహిరంగ విచారణ

హన్మకొండ: తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన (2024–25 నుంచి 2028–29 ఆర్థిక సంవత్సరం వరకు) విద్యుత్ చార్జీలు, సమగ్ర ఆదాయ ఆవశ్యకత ప్రతిపాదనలపై ఈనెల 24న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) బహిరంగ విచారణ చేపడుతుందని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ విచారణ ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ విచారణకు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు.

నకిలీ పిస్టల్‌తో బెదిరింపులు

- దేహశుద్ధి చేసిన స్థానికులు
- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

దామెర : ఓ కిరాణాషాపులోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలంటూ నకిలీ పిస్టల్‌తో ఓ వ్యక్తి బెదిరించిన ఘటన మండలంలోని ఊరుగొండలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కందికొండ సంపత్ జాతీయ రహదారి పక్కనే నివాసమంటూ కిరాణాషాపును నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి వచ్చి షట్టర్ కొడుతుండగా, ఏం కావాలని అడగగా, బిస్కెట్ ప్యాకెట్లు కావాలని తెలిపాడు. దీంతో నమ్మిన సంపత్ షట్టర్ తెరవగానే సదరు వ్యక్తి తన వద్ద ఉన్న నకిలీ పిస్టల్‌ను తీసి సంపత్‌ను బెదిరించాడు. డబ్బులు ఇవ్వాలని లేకుంటే చంపేస్తానంటూ బెదిరించాడు. సంపత్ వెంటనే భయంతో తన దగ్గర డబ్బులు లేవంటూనే కేకలు వేశాడు. దీంతో స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరకుని సదరు వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. సదరు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సంపత్ పేర్కొన్నారు.

వ్యక్తిపై గతంలో పలు కేసులు

డబ్బుల కోసం నకిలీ పిస్టల్‌తో బెదిరించిన వ్యక్తి గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. సదరు వ్యక్తిని పోలీసులు విచారిస్తుండగా, పలు కేసుల వివరాలు బయటకు వస్తున్నట్లు తెలిసింది. ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా నిందితుడిని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



పద్మకు బీమా చెక్కును అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ద్వారా కర్షక మిత్ర వ్యవసాయ రుణం తీసుకుని మృతి చెందిన రైతు కుటుంబానికి టెస్కాబ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు బీమా చెక్కును అందించారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సీపేటకు చెందిన యార రాజారెడ్డి ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. డీసీసీబీ ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతుకు బీమా సంస్థ ఇఫ్కో టోక్యో ఇన్సూరెన్స్ కంపెనీ రూ.8 లక్షల క్లెయిమ్ మంజూరు చేయగా సోమవారం హనుమకొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆ బీమా చెక్కును రాజిరెడ్డి సతీమణి యార పద్మకు రవీందర్ రావు అందించారు. డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎం ఉషాశ్రీ, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, రాజు, కృష్ణ మోహన్, గొట్టం స్రవంతి, గంప స్రవంతి, ఇఫ్కో టోక్యో ఇన్సూరెన్స్ కంపెనీ తెలంగాణ ఇన్‌చార్జ్ బిజేశ్, వరంగల్ మేనేజర్ శేషు పాల్గొన్నారు.

ప్రతీ బస్తా కొనుగోలు చేస్తాం

- రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఏనుమాములలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద

వరంగల్ : రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట ఉత్పత్తుల ప్రతీ బస్తాను కొనుగోలు చేస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డులో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్దదైన వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని దేశంలోనే మొదటగా ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చి గరిష్ట ధరను పొందాలని మంత్రి సూచించారు. తేమను దృష్టిలో ఉంచుకొని ధర నిర్ణయించడం జరుగుతున్నందున, తేమ వల్ల రైతులు నష్టపోకుండా పరిశీలించేందుకు కమిటీని నియమించామన్నారు. పత్తి విక్రయించిన మూడు రోజుల్లోనే సంబంధిత రైతు బ్యాంకు అకౌంట్‌లో నేరుగా డబ్బులు జమ అవుతాయన్నారు.

24 గంటలు నాణ్యమైన విద్యుత్..

రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతుల సంక్షేమం కోసం 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రైతు రుణమాఫీ చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

మొదటి విడతలో 14 కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా 27 కొనుగోలు కేంద్రాలను గుర్తించి మొదటి విడతలో 14 కేంద్రాలు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. అందులో భాగంగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రారంభం కాగా మిగిలిన నర్సంపేట నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలను వారంలోగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తూర్పాటి సులోచన, పోశాల పద్మ, భోగి సువర్ణ, చింతాకుల అనిల్, ఉమాదామోదర్ యాదవ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ జనరల్ మేనేజర్ అర్జున్ దుబే, మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, కాటన్ కొనుగోలు అధికారి కృష్ణారెడ్డి, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

గీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు

- మంత్రి కొండా సురేఖ

కల్లుగీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు అందిస్తున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డు ప్రాంగణంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కులవృత్తులకు అన్ని విధాలా చేయూత అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 10 వేల మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు గీత కార్మికుడు ప్రయోగాత్మకంగా కాటమయ్య భద్రత కిట్ ధరించి చెట్టు ఎక్కిన తీరును మంత్రి, కలెక్టర్లు పరిశీలించారు. కార్పొరేటర్లు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా అబ్కారీ అధికారి చంద్రశేఖర్, గౌడ సంఘ నాయకులు నర్సయ్య, శ్రీనివాస్, యుగేందర్ పాల్గొన్నారు.

మిత్రుడిని కాలేజీలో వదిలిపెట్టేందుకు వెళ్తూ..

- బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరి మృతి
- జమాండ్లపల్లిలో ఘటన



రాస్తారోకో చేస్తున్న మృతుల బంధువులు, గ్రామస్తులు



అరుణ్‌కుమార్ (ఫైల్)



మణికంఠ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : తోటి మిత్రుడిని కాలేజీలో వదిలి పెట్టేందుకు వెళ్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు మిత్రులు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి శివారులోని అర్బన్ పార్క్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడుకు చెందిన నీల రమేశ్, గౌతమి దంపతుల రెండో కుమారుడు అరుణ్‌కుమార్ (18) మానుకోటలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన సంగెం ఉపేందర్, మంజుల దంపతుల ఏకైక కుమారుడు మణికంఠ (19) హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళా శాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇద్దరు మిత్రులు దసరా పండుగకు ఇంటికి వచ్చారు. సెలవులు పూర్తి కాగా అరుణ్‌కుమార్‌ను మానుకోటలోని ఎంజేపీఆర్‌సీలో వదిలిపెట్టేందుకు మణికంఠ ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో వారి బైక్ జమాండ్లపల్లి శివారులో గల అర్బన్‌పార్క్ ప్రాంతంలోకి చేరుకుంటుండగా ఎదురుగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. సరైన దారిలో వస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టడంతో పాటు కొంత దూరం వరకు దూసుకెళ్లి రోడ్డు పక్కన ఉన్న చెట్లలో పడిపోయింది. ద్వి చక్ర వాహనం నుజ్జునుజ్జు అయి అరుణ్‌కుమార్, మణికంఠలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రూరల్ ఎస్సై దీపికారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు నడుపుతున్న సామ మణికంఠను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం..

కారు ఢీకొన్న ఘటనలో మృతిచెందిన అరుణ్ కుమార్, మణికంఠ ఇద్దరు బాల్య మిత్రులు కావడంతో పాటు ప్రాణస్నేహితులు. అప్పటి వరకు పొనుగోడులో ఇద్దరు కలిసి తిరిగిన కొద్ది సేపటికే దుర్మరణం చెంది విగతజీవులుగా పడి ఉండడాన్ని చూసిన బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు ఒక్కే రోజు మృతి చెందడంతో మరణంలోనూ వారి బంధం వీడలేదు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

న్యాయం చేయాలని రాస్తారోకో

మిత్రుల మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలని, కారు ఢీకొన్న ఘటనలో మృతిచెందిన అరుణ్ కుమార్, మణికంఠ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి మహబూబాబాద్‌లోని అండర్ బ్రిడ్జి ప్రాంతంలో మృతుల బంధువులు, గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, రూరల్ ఎస్సై దీపికారెడ్డి రాస్తారోకో వద్దకు చేరుకుని మృతుల బంధువులు, గ్రామస్తులతో మాట్లాడారు. తమకు న్యాయం జరిగేంత వరకు రాస్తారోకో విరమించమని వారు చెప్పగా సీఐ సర్వయ్య ఫోన్లో డీఎస్పీ తిరుపతిరావుతో మాట్లాడించారు. దీంతో మృతుల బంధువులు, గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.